తదుపరి సిరాజ్ ఎవరు?

ఓల్డ్ సిటీలో వినూత్నంగా టాలెంట్ హంట్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత క్రికెట్ జట్టు స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ తర్వాత హైదరాబాద్ నుంచి జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే బౌలర్ ఎవరు? అన్న వినూత్న కాన్సెప్ట్‌తో బీసీసీఐ మాజీ చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్.. ఓల్డ్ సిటీలో టాలెంట్ హంట్‌కు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆరాంఘర్‌లోని విజయానంద్ గ్రౌండ్స్‌లో 'మన తదుపరి సిరాజ్ ఎవరు?' (హూ ఈజ్ అవర్ నెక్స్ట్ సిరాజ్) అన్న ట్యాగ్‌లైన్‌తో ఓల్డ్ సిటీకి చెందిన నిరుపేద క్రికెటర్ల కోసం ఎంఎస్‌కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ ఈ ట్రయల్స్‌ను విజయవంతంగా నిర్వహించింది. సుమారు 400 మంది ఔత్సాహిక క్రికెటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, పేసర్ సిరాజ్, టీఎన్‌జీఓ జనరల్ సెక్రటరీ ముజీబ్ హాజరయ్యారు. ఈ ట్రయల్స్‌ను యువ క్రికెటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఒవైసీ పిలుపునిచ్చారు. సిరాజ్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకుని ఔత్సాహిక క్రికెటర్లు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించాడు. ఈ సందర్భంగా సిరాజ్ తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న కష్టాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యాడు. ఎంఎస్‌కే మాట్లాడుతూ.. పాతబస్తీలో ప్రతిభావంతులైన, పేద పిల్లలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు నిస్వార్థంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

డానిష్ శతకం

నిలకడగా ఆడుతున్న విదర్భ

నాగ్‌పూర్: కేరళతో నాగ్‌పూర్ వేదికగా జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్‌లో తొలిరోజు విదర్భను ఆ జట్టు యువ బ్యాటర్ డానిష్ మలేవర్ (259 బంతుల్లో 138 నాటౌట్, 14 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ శతకంతో ఆదుకున్నాడు. డానిష్‌తో పాటు సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ (86) రాణించడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ 4 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. ఒక దశలో 24 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన ఆ జట్టును డానిష్, కరుణ్ పోరాటం నిలబెట్టింది. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 215 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యం గా 21 ఏండ్ల డానిష్.. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి కరుణ్ నాయర్‌తో మూడు సెషన్ల పాటు కేరళ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. అతడికి ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో ఇది రెండో శతకం కావడం విశేషం. ఆట ముగిసే సమయానికి డానిష్‌తో పాటు యశ్ ఠాకూర్ (5 నాటౌట్) క్రీజులో ఉన్నారు. కేరళ బౌలర్లు ఆరంభంలోనే మ్యాచ్‌పై చిక్కిన పట్టును కొనసాగించలేకపోయారు.

టాప్-5లోకి కోహ్లీ

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అజేయ శతకంతో చెలరేగిన రన్ మిషీన్ విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్-5లోకి చేరాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో టీమ్ ఇండియా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ 817 పాయింట్లతో అగ్రస్థానాన్ని కొనసాగిస్తుండగా బాబర్ ఆజమ్ రెండో స్థానంలో ఉన్నాడు. రోహిత్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ వరుసగా 3,4 స్థానాల్లో నిలిచారు. గతవారంతో పోల్చితే ఒక ర్యాంకును మెరుగుపర్చుకున్న కోహ్లీ.. ఐదో స్థానంలోకి వచ్చాడు. టాప్-10లో భారత్ నుంచి గిల్, రోహిత్, కోహ్లీతో పాటు 9వ స్థానంలో శ్రేయాస్ అయ్యర్ నిలిచాడు. బౌలర్ల జాబితాలో కుల్‌దీప్ యాదవ్ (3వ స్థానం) ఒక్కడే భారత్ నుంచి టాప్-10లో చోటు దక్కించుకున్నాడు.

ఇంగ్లండ్ ఇంటికి

జద్రాన్ (177)

1 అఫ్గానిస్థాన్ తరపున వన్డేలలో అత్యుత్తమ స్కోరు (177) చేసిన క్రికెటర్ జద్రాన్. ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీలోనూ శతకం చేసిన తొలి అఫ్గాన్ బ్యాటర్ అతడే

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీ సెమీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్.. ఇంగ్లండ్‌పై సంచలన విజయం సాధించింది. వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌ను ఓడించిన అఫ్గాన్.. తాజాగా చాంపియన్స్ ట్రోఫీలోనూ ఇంగ్లీష్ జట్టుకు పీడకలను మిగుల్చుతూ ఆ జట్టును టోర్నీ నుంచి పంపించింది. బుధవారం లాహోర్‌లోని గడాఫీ స్టేడియం వేదికగా ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో అఫ్గాన్.. 8 పరుగుల తేడాతో బట్లర్ సేనను ఓడించి సెమీస్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. ఇబ్రహీం జద్రాన్ (144 బంతుల్లో 177, 12 ఫోర్లు, 6 సిక్సర్లు) చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో చారిత్రాత్మక ఇన్నింగ్స్ ఆడగా అజ్మతుల్లా ఒమర్‌జయ్ (బ్యాట్‌తో 40, బంతితో 5/58)ఆల్‌రౌండ్ షోతో ఇంగ్లండ్‌ను ఇంటికి సాగనంపారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గాన్.. జద్రాన్‌తో పాటు నబీ (24 బంతుల్లో 40, 2 ఫోర్లు, 3 సిక్సర్లు), అజ్మతుల్లా రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 325 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో ఇంగ్లండ్.. 49.5 ఓవర్లలో 317 పరుగుల వద్దే ఆగిపోయింది. జో రూట్ (111 బంతుల్లో 120, 11 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత శతకంతో మెరిసి లక్ష్యానికి చేరువగా వచ్చినా ఆఖర్లో ఆ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ఓటమిని కొనితెచ్చుకుంది. జద్రాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

జద్రాన్.. జబర్దస్త్ షో

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన అఫ్గానిస్థాన్‌కు ఆరంభంలోనే వరుస షాకులు తాకాయి. ఓపెనర్ గుర్బాజ్ (6), సెదికుల్లా (4), రహ్మత్ (4) విఫలమవడంతో ఆ జట్టు 9 ఓవర్లలో 37 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయింది. కానీ జద్రాన్ పోరాటం ఆ జట్టును నిలబెట్టింది. సారథి హష్మతుల్లా షాహిది (40)తో కలిసి నాలుగో వికెట్‌కు 103 పరుగులు జోడించిన అతడు.. క్రీజులో కుదురుకున్నాక ఇంగ్లండ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. ఓవర్టన్ 28వ ఓవర్లో 6, 4, 4తో నెమ్మదిగా సాగుతున్న ఇన్నింగ్స్ గేర్ మార్చిన అతడు.. ఆ తర్వాత మరింత రెచ్చిపోయాడు. లివింగ్‌స్టన్ 37వ ఓవర్లో మూడో బంతికి సింగిల్ తీసి వన్డేలలో ఆరో శతకం పూర్తిచేసుకున్నాడు. అజ్మతుల్లాతో కలిసి ఐదో వికెట్‌కు 72 పరుగులు జతచేసిన జద్రాన్.. శతకం తర్వాత మరింత దూకుడు పెంచాడు. ఆర్చర్ 44వ ఓవర్లో 6, 4, 4, 4 బాదాడు. మరో ఎండ్‌లో నబీ కూడా రూట్ 47వ ఓవర్లో 6, 6, 4 కొట్టడంతో అఫ్గాన్ 300 పరుగుల మార్కును చేరుకుంది.

చాంపియన్స్ ట్రోఫీ నుంచి నిష్క్రమణ

ఉత్కంఠ పోరులో అఫ్గాన్ సంచలన విజయం

జద్రాన్ రికార్డు శతకం

రూట్ పోరాటం వృథా

అజ్మతుల్లా (5/58)

రూట్ పోరాడినా..

భారీ ఛేదనలో ఇంగ్లండ్.. 4వ ఓవర్లోనే ఓపెనర్ సాల్ట్ (12) వికెట్ కోల్పోయింది. నబీ వేసిన ఏడో ఓవర్లో స్మిత్ (9) నిష్క్రమించాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన రూట్‌తో కలిసి డకెట్ (38) మూడో వికెట్‌కు 68 పరుగులు జతచేశాడు. కానీ రషీద్ 17వ ఓవర్లో డకెట్‌ను రషీద్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. బ్రూక్ (25) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. కానీ కెప్టెన్ బట్లర్‌తో కలిసి రూట్.. ఇంగ్లండ్‌ను లక్ష్యం దిశగా నడిపించాడు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 83 రన్స్ జోడించారు. కానీ అజ్మతుల్లా 37వ ఓవర్లో బట్లర్ భారీ షాట్ ఆడబోయి రహ్మత్ షాకు క్యాచ్ ఇవ్వగా లివింగ్‌స్టన్ (10)ను గుల్బాదిన్ బోల్తా కొట్టించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా పట్టుదలతో క్రీజులో నిలిచిన రూట్.. ఐదేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత వన్డేలలో శతకం పూర్తిచేశాడు. లివింగ్‌స్టన్ ఔట్ అయినా అతడి స్థానంలో వచ్చిన జేమీ ఓవర్టన్ (28 బంతుల్లో 32, 4 ఫోర్లు) అఫ్గాన్‌ను భయపెట్టాడు. గెలుపు దిశగా సాగుతున్న ఇంగ్లండ్‌ను అజ్మతుల్లా వరుస ఓవర్లలో దెబ్బకొట్టాడు. 46వ ఓవర్లో రూట్‌ను ఔట్ చేసిన అతడు.. 48వ ఓవర్లో ఓవర్టన్‌ను పెవిలియన్‌కు పంపాడు. 49వ ఓవర్లో ఫరూఖీ.. ఆర్చర్ (14)ను ఔట్ చేయడంతో ఇంగ్లండ్ ఆఖరి ఓవర్లో 13 పరుగులు అవసరమయ్యాయి. కానీ చివరి ఓవర్లో అజ్మతుల్లా 4 పరుగులే ఇవ్వడంతో పాటు ఐదో బంతికి రషీద్ (5)ను ఔట్ చేయడంతో అఫ్గాన్ మరో చరిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది.

1 చాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక స్కోరు జద్రాన్‌దే. బెన్ డకెట్ (165) రికార్డు కనుమరుగైంది.

సంక్షిప్త స్కోర్లు:

అఫ్గాన్: 50 ఓవర్లలో 325/7 (జద్రాన్ 177, నబీ 40, ఆర్చర్ 3/64, లివింగ్‌స్టన్ 2/58)

ఇంగ్లండ్: 49.5 ఓవర్లలో 317 ఆలౌట్ (రూట్ 120, బట్లర్ 38, అజ్మతుల్లా 5/58, నబీ 2/57)

సీవర్ సూపర్

ఆల్‌రౌండ్ షోతో అదుర్స్ • యూపీపై ముంబై ఘనవిజయం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ మూడో విజయాన్ని నమోదుచేసింది. బుధవారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 8 వికెట్ల తేడాతో గెలిచింది. దీంతో ఆ జట్టు ఆడిన నాలుగింట్లో మూడు మ్యాచ్‌లు గెలిచి ఆరు పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. గత మ్యాచ్‌లో సూపర్ ఓవర్‌తో ఆర్‌సీబీపై ఉత్కంఠ విజయం సాధించిన యూపీ వారియర్స్.. ముంబైతో మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యంతో పరాభవం పాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన యూపీ.. గ్రేస్ హారిస్ (26 బంతుల్లో 45, 6 ఫోర్లు, 2 సిక్సర్లు), వృందా దినేశ్ (33) ఆదుకోవడంతో 20 ఓవర్లలో 142/9 స్కోరు చేసింది. ముంబై బౌలర్లలో సీవర్ (3/18), సంస్కృతి గుప్తా (2/11), షబ్నమ్ ఇస్మైల్ (2/33) యూపీని కట్టడి చేశారు. అనంతరం ఛేదనను ముంబై.. 17 ఓవర్లలోనే దంచేసింది. బంతితో అదరగొట్టిన సీవర్ (44 బంతుల్లో 75 నాటౌట్, 13 ఫోర్లు).. బ్యాట్‌తోనూ సత్తా చాటి ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. హేలీ మాథ్యూస్ (50 బంతుల్లో 59, 7 ఫోర్లు, 2 సిక్సర్లు) సీవర్‌కు అండగా నిలిచింది. బ్యాట్‌తో విఫలమైన యూపీ.. బంతితోనూ తేలిపోవడంతో ఆ జట్టుకు ఈ సీజన్‌లో మూడో ఓటమి తప్పలేదు.

మాథ్యూస్ (59)

సీవర్ (3/18, 75*)

తెలంగాణకు రజతం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హర్యానాలోని భివాని వేదికగా ఈనెల 23-26 మధ్య జరిగిన 37వ జూనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ బాయ్స్ అండ్ గర్ల్స్ 2024-25 పోటీలలో తెలంగాణ రజతం సాధించింది. బాలికల విభాగంలో కేరళ జట్టు స్వర్ణం దక్కించుకోగా తెలంగాణ నెట్‌బాల్ టీమ్ సిల్వర్ గెలిచింది. హర్యానా మూడో స్థానంలో నిలిచింది.

జార్జ్, రజావత్ శుభారంభం

ముల్హీమ్: జర్మన్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు కిరణ్ జార్జి, ప్రియాన్షు రజావత్ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లలో భాగంగా జార్జి.. 21-18, 19-21, 21-16తో ఓల్డార్ఫ్ (ఫిన్‌లాండ్)ను ఓడించాడు. రజావత్.. 21-14, 21-14తో భారత్‌కే చెందిన కిదాంబి శ్రీకాంత్‌ను చిత్తుచేశాడు. తరుణ్ మన్నెపల్లి.. 10-21, 21-19, 21-19తో జొనాసెన్ (డెన్మార్క్)ను ఓడించి రెండో రౌండ్‌కు చేరాడు. మహిళల సింగిల్స్‌లో అన్మోల్ ఖర్బ్ ఓటమిపాలవగా ఉన్నతి హుడా, రక్షిత విజయాలు సాధించారు.

పరువు కోసం పాక్, బంగ్లా ఆఖరి పోరు

రావల్పిండి: సుమారు మూడు దశాబ్దాల తర్వాత ఐసీసీ ట్రోఫీకి ఆతిథ్య మిస్తూ కనీసం గ్రూప్ దశ కూడా దాటకుండా వైదొలిగిన పాకిస్థాన్.. గురువారం రావల్పిండి వేదికగా ఈ టోర్నీలో తమ ఆఖరి మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో ఆడనుంది. పాక్‌తో పాటు వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిన బంగ్లా కూడా టోర్నీ నుంచి వైదొలిగిన విషయం విదితమే. సొంతగడ్డపై అభిమానుల అసంతృప్తులు, మాజీ క్రికెటర్ల విమర్శలతో సతమతమవుతున్న రిజ్వాన్ సేన.. ఈ మ్యాచ్‌లో అయినా గెలిచి పరువు దక్కించుకోవాలని భావిస్తోంది. తమ నెమ్మదైన బ్యాటింగ్ తీరుతో తీవ్ర విమర్శల పాలవుతున్న బాబర్, రిజ్వాన్ నేటి మ్యాచ్‌లో ఎలా ఆడతారనేది ఆసక్తికరం.

ప్రైవేటుకు సింగరేణి అన్వేషణ విభాగం?

ఇప్పటికే బెల్లంపల్లి విభాగాన్ని మూసేసిన సంస్థ • 250 మంది సిబ్బంది భవిష్యత్తుపై నీలినీడలు

గోదావరిఖని, ఫిబ్రవరి 26: సింగరేణి సంస్థకు గుండెకాయగా చెప్పుకునే అన్వేషణ విభాగం ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే బెల్లంపల్లి విభాగాన్ని మూసివేసిన సింగరేణి యాజమాన్యం.. రామగుండం విభాగంలో పనిచేసే కార్మికులకు పనులు లేవనే సాకుతో పర్మినెంట్ కార్మికులను తొలగించి మొత్తం అన్వేషణ విభాగాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు వేగంగా పావులు కదుపుతున్నట్లుగా తెలుస్తున్నది. ప్రస్తుతం రామగుండం విభాగం కిందనే భూపాలపల్లి ఏరియా అన్వేషణ విభాగం పనులు సాగుతున్నాయి. మొత్తం 150 మంది శాశ్వత కార్మికులు, 100 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేసే ఈ డిపార్ట్‌మెంట్‌లో పనులు లేవని సాకుగా చూపుతున్నట్లుగా తెలుస్తుంది. సింగరేణిలో కొత్త గనులకు పర్యావరణ అటవీ అనుమతులు ఆలస్యం అవుతుండడం వల్లే వీరికి పనుల విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు కనిపిస్తున్నది. సింగరేణి తాడిచెర్ల బ్లాక్‌కు క్లియరెన్స్ వస్తే మరో మూడేండ్లపాటు వీరందరికీ పనులు ఉండే అవకాశం ఉంది. కానీ ఈ బ్లాక్‌కు ఇప్పట్లో అనుమతులు వచ్చే అవకాశాలు కనిపించకపోవడంతో ఈ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కాంట్రాక్ట్ కార్మికులు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్, ప్రైవేట్ డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇటీవల బెల్లంపల్లి ఏరియాలో ఇవే పరిస్థితు అన్వేషణ విభాగాన్ని మూసివేయగా, పర్మినెంట్ కార్మికులను ఇతర విభాగాల్లోకి సర్దుబాటు చేశారు. మిగిలిన కొందరు కార్మికులను రామగుండం అన్వేషణ విభాగంలో విధులు కల్పించారు. అయితే ఇక్కడ డ్రిల్స్‌కి సరపడా కార్మికులు ఉండగా, బెల్లంపల్లి కార్మికులు అదనంగా ఉండిపోయారు. దీని పర్యావసానంగా కార్మికులకు రావాల్సిన పదోన్నతులు రాకుండా పోతున్నాయి. బెల్లంపల్లిలో పనిచేసిన అధికారులను బదిలీ చేసి ఒరిస్సాలోని నైనీ బ్లాక్, ఆ తర్వాత రామగుండం, కొత్తగూడెంలో సర్దుబాటు చేశారు. కార్మికులకు పదోన్నతులు కల్పించని యాజమాన్యం, అధికారులకు మాత్రం ప్రమోషన్లు ఇచ్చి అందలం ఎక్కిస్తున్నది. అధికారులకు అన్ని రకాలుగా ప్రయోజనాలను కల్పిస్తూ జీటీ ల్యాబ్, ఎస్‌పీటీ టెస్టుల పేరిట మరికొన్ని కొత్త పనులను సృష్టించి వారికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారుల పదోన్నతులలో ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రతి మూడేండ్లకు పదోన్నతి లభించే విధంగా చేస్తున్నది. కొంత మంది పర్మినెంట్ కార్మికులు 15 ఏండ్లుగా పనిచేసినా ప్రమోషన్ రాకుండా పోతున్నది. ఇదంతా డిపార్టుమెంట్‌లో ఒక భాగమైతే, మరో వైపు కొత్త బ్లాక్‌ల కొరత ఎక్కువైంది.

రాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు

ఇటీవల కాలంలో తాడిచెర్ల డ్రిల్లింగ్‌కు కేంద్రం అనుమతులు ఇవ్వగా, రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖ అధికారులు అనేక కొర్రీలు పెడుతూ కాలయాపన చేస్తున్నట్లు తెలిసింది. ఫలితంగా కార్మికులకు విధులు లేక కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు లేక 40 రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. ఇంత జరిగినా సింగరేణిలో కొత్త బ్లాక్‌ల కోసం అటవీ శాఖ అనుమతుల కోసం ముఖ్య పాత్ర పోషించే జియాలజీ విభాగం అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి అనుమతులు కోసం ప్రయత్నాలు చేయాలని, పనులు కల్పించేలా చూడాలని కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, ప్రైవేట్ డ్రైవర్స్, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు కోరుతున్నారు.



బయోఏషియా సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

రాష్ట్రంలో కొత్తగా లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ

• ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జరిగిన బయోఏషియా 2025 సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ ఎక్కడ ఏర్పాటు చేసేదానిపై చర్చలు జరుగుతున్నాయని, త్వరలో కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నదన్నారు. మరోవైపు, లైఫ్ సైన్సెస్ పాలసీపై త్వరలోనే క్యాబినెట్ నిర్ణయం తీసుకోనున్నదన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఉన్న లోపాల వల్ల విద్యార్థులకు తగిన నైపుణ్యం లభించడం లేదని, ఈ అంతరాన్ని తగ్గించడమే లక్ష్యంగా పరిశ్రమల భాగస్వామ్యంతో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. కాలుష్య రహిత ఫార్మా పరిశ్రమలను ఏర్పాటే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నదని, ముఖ్యంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు ఈ యూనిట్లను తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వికారాబాద్, జహీరాబాద్‌లలో ఇప్పటికే స్థలాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈసారి నిర్వహించిన సదస్సులో ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్‌కేర్ రంగాలకు చెందిన 3 వేల మంది డెలిగేట్స్ పాల్గొన్నారు.

ఐదు స్టార్టప్‌లకు అవార్డులు

బయో ఏషియా సదస్సుకు హాజరైన 84 స్టార్టప్‌ల్లో ఐదు స్టార్టప్‌లకు అవార్డులు వరించాయి. వీటిలో సెమ్‌జినోమీ, జెనికా బయోసైన్స్, ప్రాంజ్ బయోసైన్స్, బొల్టజ్మాన్ ల్యాబ్స్ ఉన్నాయి. కొత్త ఆలోచనలను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేస్తున్నదని శ్రీధర్‌బాబు వివరించారు.

బయోఏషియా సదస్సులో ఏఐ ఆధారిత స్మార్ట్ నోట్‌బుక్‌ను పరిచయం చేసిన క్వాడ్రిక్ ఐటీ సంస్థ ప్రతినిధులు సుమన్ బాలబొమ్మ, కేసరి సబ్నివీజు, రఘురామ్

రెన్యూవబుల్ ఎనర్జీలోకి మైక్రోమాక్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: దేశీయ కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ మైక్రోమాక్స్ ఇన్ఫర్మేటిక్స్.. రెన్యూవబుల్ ఎనర్జీ విభాగంలోకి అడుగుపెట్టింది. ఇందుకోసం ఎనర్జీ స్టార్టప్‌ను ప్రారంభించింది కూడా. ఈ కొత్త వెంచర్‌తో దేశీయ సోలార్ ప్యానెల్ తయారీలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంగా పెట్టుకున్నది. అలాగే సుస్థిర ఇంధనాన్ని విస్తృత పరచడంతోపాటు ప్రతిష్ఠాత్మకమైన క్లీన్ ఎనర్జీ మిషన్‌కు మద్దతునిస్తున్నదని కంపెనీ ఎండీ రాజేశ్ అగర్వాల్ తెలిపారు. రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రీయల్ కోసం అధిక సామర్థ్యం కలిగిన సౌర ఫలకాలను ఉత్పత్తి చేయాలని నిర్ణయించినట్లు, ఇందుకోసం ప్రత్యేక యూనిట్‌ను నెలకొల్పబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

స్టార్ హెల్త్ హోమ్ హెల్త్‌కేర్ విస్తరణ

చెన్నై, ఫిబ్రవరి 26: హెల్త్ ఇన్సూరెన్స్ సేవల సంస్థ స్టార్ హెల్త్..తన హోమ్ హెల్త్‌కేర్ సర్వీసులను మరిన్ని నగరాలకు విస్తరించింది. రెండేండ్ల క్రితం ప్రారంభించిన ఈ సేవలకు కస్టమర్ల నుంచి విశేష స్పందన రావడంతో మరో 100 ప్రాంతాలకు విస్తరించినట్లు కంపెనీ ఎండీ, సీఈవో ఆనంద్ రాయ్ తెలిపారు. స్టార్ హెల్త్ పాలసీలు తీసుకున్న 85 శాతం మందికి ఇంటివద్దనే నగదు రహిత వైద్య సేవలు అందించింది. వైరల్ ఫీవర్, డెంగ్యూ రోగాలతో బాధపడుతున్న వారికి ఇంటి వద్దనే వైద్య సేవలు కల్పించింది.

ఎయిర్‌టెల్-టాటా ప్లే విలీనం?

డీటీహెచ్ వ్యాపారాన్ని ఏకం చేసే దిశగా చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: భారతీ ఎయిర్‌టెల్ తమ డీటీహెచ్ వ్యాపారాన్ని విలీనం చేసే దిశగా వెళ్తున్నది. టాటా ప్లేతో భారతీ టెలీమీడియా ఆధ్వర్యంలోని ఎయిర్‌టెల్ డిజిటల్ టీవీని షేర్ల మార్పిడి డీల్ ద్వారా కలపాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇక టాటా ప్లే వ్యాపార కార్యకలాపాలు సైతం ఒత్తిడిలోనే ఉండగా, అందుకే ఈ ఒప్పందం అనంతరం ఏర్పడబోయే కొత్త సంస్థలో ఎయిర్‌టెల్‌కు 52-55 శాతం వాటా, టాటా ప్లే భాగస్వాములైన టాటా సన్స్, వాల్ట్ డిస్నీలకు 45-48 శాతం వాటా ఉంటుందని సమాచారం. కాగా, ఈ డీల్ తమ టెలికం, బ్రాడ్‌బ్యాండ్, డీటీహెచ్‌ల వ్యాపారాల వృద్ధికి దోహదం చేస్తుందని ఎయిర్‌టెల్ బలంగా నమ్ముతున్నది. మొత్తానికి ఇటీవలే రిలయన్స్, డిస్నీ స్టార్ ఇండియా-వయకామ్18 విలీనమై దేశీయ అతిపెద్ద మీడియా కంపెనీ జియోస్టార్‌ను తెచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎయిర్‌టెల్ డిజిటల్ టీవీ, టాటా ప్లే విలీనం ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. ఇది కుదిరితే భారతీయ డీటీహెచ్ రంగంలో మరో భారీ విలీనం చోటు చేసుకోవడం ఖాయమనే చెప్పాలి.

ఒత్తిడిలో డీటీహెచ్

మొన్నటిదాకా ఓ వెలుగు వెలిగిన డైరెక్ట్ టు హోమ్ (డీటీహెచ్) వ్యాపారం ఇప్పుడు మసకబారిపోయింది. ఇందుకు కారణం ఓటీటీ (ఓవర్-ది-టాప్) ట్రెండ్ పెరిగిపోవడమే. నానాటికీ పెరుగుతున్న స్మార్ట్‌టీవీల అమ్మకాలకు తగ్గట్టుగా బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లూ పెరిగిపోతున్నాయి. దీంతో సంప్రదాయ డీటీహెచ్ సేవలకు పెద్దగా గిరాకీ లేకుండాపోయింది. ఇంటర్నెట్ ప్యాకేజీలోనే ఆయా ఓటీటీల సబ్‌స్క్రిప్షన్ కలగలసి రావడం, డీటీహెచ్ ప్లాన్లతో పోల్చితే ధరలు తక్కువగా ఉండటంతో అంతా బ్రాడ్‌బ్యాండ్ వైపే మొగ్గు చూపుతున్నారు. కొత్తగా విడుదలైన సినిమాలు థియేటర్‌ల నుంచి నేరుగా ఓటీటీల్లోకి వస్తుండటం, వీటికి వెబ్‌సిరీస్‌